నేడు లక్ష్మీగణపతి హోమం

మోతీనగర్: కబీర్‌నగర్‌లోని శ్రీశివరామాంజనేయ దేవాలయంలో కొలువైన వినాయకస్వామికి గురువారం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు రామాచార్లు తెలిపారు. ఉదయం 8గంటలకు లక్ష్మీగణపతి హోమం , సాయంత్రం 6.30గంటలకు అభిషేకం జరుపుతామన్నారు.

నేడు అన్నదానం

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలోని పలు దేవాలయాల్లో గురువారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అవంతనగర్‌తోటలోని షిరిడీ సాయిబాబా దేవాలయం, పాండురంగనగర్‌లోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం, స్నేహపురికాలనీ, అల్లాపూర్ డివిజన్‌లోని గణేష్‌నగర్, శ్రీవివేకానందనగర్‌లలోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కమిషనర్‌కు వినతి పత్రం.. వెంటనే పరిసరాల పరిశుభ్రం



హైదర్‌నగర్ స్కూల్ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

కూకట్‌పల్లి: ఫౌంటెయిన్ హెడ్ గ్లోబల్ స్కూల్ (స్వాన్ సేవ్ అండ్ వాటర్ సేవర్) వ్యవస్థాపకురాలు మేఘనా ముసునూరి, ఓజోన్ రన్ వ్యవస్థాపకురాలు తీర్థ ఉన్నమ్‌తో హైదర్‌నగర్ ప్రాంతంలోని స్కూల్ కమ్యూనిటీ సమీపంలో పరిసరాల పరిశుభ్రతపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం జీహెచ్ఎంసీ సిబ్బంది స్పందించి స్కూల్ పరిసర ప్రాంతంలో రోడ్లను శుభ్రం చేశారు. చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా తక్షణమే స్పందించి పరిసరాలను శుభ్రం చేయించినందుకు రోనాల్డ్ రాస్‌కు పాఠశాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయం

బీజేపీ అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు



భాగ్యనగర్‌కాలనీ: దేశమంతా నమో మోదీ అనే నినాదమే నడుస్తోందని.. మోదీని భారత ప్రజలు మూడోసారి భారత ప్రధానిగా చూడాలనుకుంటున్నారని బీజేపీ అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు అన్నారు. భారతీయుల శతాబ్దాల కల అయిన శ్రీరామ మందిర పునర్ నిర్మాణం ప్రధాని మోదీతోనే సాధ్యమైందని అన్నారు. ఎప్పుడూ అల్లర్లు జరిగే కశ్మీర్‌లో శాంతి నెలకొల్పారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా బాంబు దాడులు జరగకుండా ప్రజలకు ఎంతో రక్షణ ఇస్తున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టనున్నారని పేర్కొన్నారు. అదే విధంగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా విశిష్టమైన సేవలు అందించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మంచి పేరు ఉందన్నారు. ఈసారి చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయమని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ నాయకత్వంలో అత్యధిక మెజార్టీతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని 2లక్షల మెజార్టీ గెలిపిస్తామని సీతారామరాజు తెలిపారు. రాత్రికి రాత్రి పార్టీ మారి టికెట్ తెచ్చుకున్న రంజిత్‌రెడ్డికి డిపాజిట్‌లు కూడా రావన్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్



కమిషనర్‌కు చెక్కును అందజేస్తున్న ఐడీపీఎల్ కంపెనీ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: వన్ టైమ్ సర్వీస్ (ఓటీఎస్) ద్వారా కూకట్‌పల్లి ఐడీపీఎల్ కంపెనీ బకాయి ఉన్న రూ. 16 కోట్లకు సంబంధించిన చెక్కును జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు కంపెనీ ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఓటీఎస్ ద్వారా ఐడీపీఎల్ సంస్థ బకాయిలు చెల్లించినందుకు కమిషనర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. మిగతా ప్రభుత్వ కంపెనీలు, కార్యాలయాలు, ఆస్తి పన్ను బకాయిదారులు ఓటీఎస్ ద్వారా బకాయిలు మార్చి 31 వరకు చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ బకాయిలను వెంటనే చెల్లించాలని 2023–24 సంవత్సరంలో ఇంటి పన్ను బకాయిలను కూడా చెల్లించవచ్చునని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఐడీపీఎల్ కంపెనీ ప్రతినిధులు, అడిషనల్ కమిషనర్లు జయరాజ్ కెన్నెడీ, గీతరాధిక, వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమం
- మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు
- కష్టకాలంలో పార్టీకి తోడుగా ఉండే వారిని మరచిపోం: మాజీ మంత్రి కేటీఆర్



మల్కాజ్‌గిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన బుధవారం తెలంగాణ భవన్‌లో మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమం జరిగింది. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కి కార్యకర్తలే అండగా నిలబడ్డారని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎవరైతే తోడుగా ఉంటారో వారిని ఎప్పటికీ మర్చిపోమని అన్నారు. తిరిగి మళ్లీ అఖండ మెజార్టీతో బీఆర్ఎస్ తెలంగాణలో అధికారంలోకి రాబోతుందన్నారు.

◆ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. తనకు ఆరోగ్యం సహకరించకున్నా మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్న ఉద్దేశంతో ఈ సమావేశానికి హాజరయ్యానని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో జరిగిన అభివృద్ధి కళ్ల ముందు కనబడుతోందన్నారు. నేడు ఎవరితో ఏం మాట్లాడినా కూడా ఇతర పార్టీలోకి వెళ్తున్నారన్న గుసగుసలు వినబడటం ఎంతో బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు కృషి చేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మేనల్లుడు బొల్లాబోయిన లోకేష్‌యాదవ్, మౌనిక వివాహం బుధవారం జరిగింది. బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ వివాహానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై నూతన వధూవరులను దీవించారు. ఈ వేడుకలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, బుర్రి యాదగిరి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – ఓల్డ్‌బోయిన్‌పల్లి

పరిశ్రమలో సెక్యూరిటీగార్డు మృతి

జీడిమెట్ల: గుర్తు తెలియని కారణంతో ఓ సెక్యూరిటీ గార్డు పరిశ్రమలో మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అంజనేయులు వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన కె.శంకర్(50) జీడిమెట్ల ఫేజ్–5లోని ఏసీఎంఐ అల్యూమినియం పరిశ్రమలో గత సంవత్సరం కాలంగా సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఎప్పటిలాగే శంకర్ డ్యూటీకి వచ్చాడు. బుధవారం ఉదయం పరిశ్రమకు వచ్చిన రాము అనే కార్మికుడు గేటు మూసి ఉండటంతో సెక్యూరిటీ అని పిలిచాడు. ఎంత పిలిచినా గేటు తీయకపోవడంతో గేటు పైకెక్కి వెళ్లి పిలిచాడు. ఉలుకు పలుకు లేకపోవడంతో దగ్గరికి వెళ్లి చూడగా మృతిచెందాడని గమనించాడు. ఏదైనా అనారోగ్యం కారణంగా శంకర్ మృతి చెందాడా లేక మరేమైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబానికి మానవతా దృక్పథంతో పరిశ్రమ యాజమాన్యం ఆర్థికంగా ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

జేఎన్‌టీయూలో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి

బాలానగర్: ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్స్ డా. ఎన్. శోభారాణి, డా. ఎమ్. పద్మావతిల ఆధ్వర్యంలో జేఎన్‌టీయూలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, విద్యార్థులు, క్యాంపస్‌లో నివాసం ఉండేవారికి వైదపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం సరిగ్గా లేకపోతే మనం ఏమి చేయలేమన్నారు. కాబట్టి ముందు జాగ్రత్తగా మనం ఆరోగ్యం విషయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా కాపాడుకోవాలని సూచించారు. ముందుగా వైద్య పరీక్షతో ఎటువంటి చిన్న సమస్య ఉన్నా సరిచేసుకోవచ్చన్నారు. అనుభవం గల వైద్యలను సంప్రదించి వారు తెలిపిన విధంగా నడుచుకోవాలన్నారు.

● యూనివర్సిటీ, కళాశాల ఎన్ఎస్ కోఆర్డినేటర్లు అపోలో ఆస్పత్రి వైద్యులను సంప్రదించి ఇక్కడ హెల్త్ చెక్ క్యాంపు ఏర్పాటు చేయటంలో వారి కృషిని అభినందిస్తున్నానని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఈసీజీ, పంటి, కేన్సర్ వంటి పలు పరీక్షలతో పాటు రక్త పరీక్షలు, షుగర్ టెస్ట్, గుండెకు సంబంధించిన పరీక్షలు గురువారం కూడా నిర్వహించనున్నట్లు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా. ప్రసన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జీవీ నర్సింహారెడ్డి, రెక్టార్ డా. విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో సమ్మర్ స్కూల్ నిర్వహణ

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.17.76 లక్షలు మంజూరు

రాయదుర్గం: సైన్స్ అకాడమీస్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు సమ్మర్ స్కూల్ నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు అయ్యాయి .ఈ ప్రోగ్రామ్ కింద నిరుపేద విద్యార్థులకు సమ్మర్‌స్కూల్ నిర్వహించడానికి హెచ్‌సీయూలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.17.76 లక్షలు మంజూరు అయ్యాయి. వేసవి పాఠశాలలను నిర్వహించడం ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, సమన్వయ కర్తగా ప్రొ.సురేష్ వ్యవహరిస్తారు.

చెత్తను సేకరణ వాహనాలకే ఇవ్వాలి

- ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు
- ఆరురోజుల యాక్షన్‌ప్లాన్‌తో ముందుకెళ్తున్న జీహెచ్ఎంసీ



చెత్తను సేకరణ వాహనాలకు ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



ఓల్డ్‌బోయిన్‌పల్లి: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా.. ప్రతి ఒక్కరూ చెత్త సేకరించే సిబ్బందికి ఇవ్వాలని బుధవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశానుసారం వారంరోజుల పాటు యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. ఈ మేరకు పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే వాహన డ్రైవర్లను పరిచయం చేశారు. ప్రతి ఇంటి నుంచి రూ.50 ఇస్తే ప్రతిరోజు చెత్తను తీసుకెళ్తారని తెలిపారు.

● మొదటి రోజు ఎస్ఎఫ్ఏ, ఎస్ఏటీ ఆటో డ్రైవర్లు, ఎస్ఎల్ఎఫ్ మెంబర్స్, వార్డు లెవల్ కో–ఆర్డినేటర్లు కలసి చెత్తపై బస్తీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. రెండో రోజు (బుధవారం) ఎవరెవరి ఇంటికి చెత్త సేకరణ వాహనాలు వెళ్లడం లేదో తెలుసుకుని వాళ్ల ఇంటికి చెత్త సేకరణ వాహనాన్ని పంపించడం వంటి చర్యలు తీసుకున్నారు.

● గురువారం (మూడో రోజు) బస్తీల్లో ర్యాలీలు నిర్వహించి చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలకు తగిన అవగాహన కల్పించడం. నాల్గో రోజు ప్రజలకు చెత్త సేకరణ వివరాలపై అవగాహన కల్పించడం వంటివి నిర్వహిస్తారు. ఐదోరోజు బస్తీల్లో చెత్త వేసే ప్రాంతాలలో ముగ్గులను వేసి అక్కడ చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకుంటారు.

● ఆరోరోజు వెండర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి చెత్తను చెత్త సేకరణ వాహనానికి అందించేలా అవగాహన కల్పిస్తారు. ఇలా ఆరోరోజుల యాక్షన్‌ప్లాన్‌లో ప్రజల్లో మార్పు వచ్చిందా లేదా అని పరిశీలిస్తామన్నారు. మరిన్ని అవగాహన కార్యక్రమాలు కల్పించి చెత్తను చెత్త సేకరించే వాహనాలకు అందించేలా తగిన చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ, ఎస్ఏటీ ఆటో డ్రైవర్లు, ఎస్ఎల్ఎఫ్ మెంబర్స్, వార్డు లెవల్ కో–ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

వాటర్ వర్క్స్ డీజీఎం రవి



ఇంకుడు గుంతల ఏర్పాటు అవగాహన కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం రవి తదితరులు

మూసాపేట: ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని.. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని వాటర్ వర్క్స్ డీజీఎం రవి అన్నారు. మూసాపేట సెక్షన్ పరిధిలో ఇంకుడు గుంతల ఏర్పాటుపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని అందుకే నీరు వృథా చేయకుండా వాడుకోవాలన్నారు. ప్రతి కాలనీ, ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని కోరారు. వర్షపునీరు ఇంకుడు గుంతలకు వెళ్తే భూగర్భ జలాలు పెరిగి ఎండాకాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంకుడు గుంతలపై ప్రజల్లో పూర్తి అవగాహన రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ సలోమి, విలియం ప్రకాష్, డివిజన్ ఇన్‌చార్జ్ మొగులయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



దుర్గామాతా ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్‌లోని రాజుకాలనీలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం, దుర్గామాతా ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు వేదపండితుల ఆధ్వర్యంలో దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని అన్నారు. ఈ ఆలయానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆలయ నిర్మాణం త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రమేష్, డివిజన్ కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటసేనారెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు శివరంజని, సూర్యప్రకాష్ రెడ్డి, చంద్రప్రకాష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

తీవ్ర ట్రాఫిక్ జామ్





వివేకానందనగర్ కమాన్ వద్ద ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ఏర్పడిన ట్రాఫిక్ జామ్

మూసాపేట: కూకట్‌పల్లి వివేకానందనగర్ కమాన్ వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు మొరాయించింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కూకట్‌పల్లి డిపోకు చెందిన (ఏపీ 28జెడ్ 5528) బస్సు మెహదీపట్నం నుంచి జగద్గిరిగుట్టకు వెళ్తోంది. బస్ రేడియేటర్‌లో నీళ్లు బాయిల్ కావడంతో పొగలు వచ్చి బస్సు ఆగిపోయింది. డిపో సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసి బస్సును డిపోకు తీసుకెళ్లారు. ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించి పంపించారు.